క్లుప్తంగా

శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీపీవో దేవరాజ్

కథలాపూర్: వర్షాకాలంలో శివారు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇంటిపన్నును వందశాతం వసూలు చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం అధికారులు గ్రామాల్లో పర్యటిస్తారని, కార్యదర్శులు గ్రామాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఎల్పీవో శంకర్, ఎంపీవో గంగాధర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై చిరంజీవి

కథలాపూర్: జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన జంగిలి గంగాధర్ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌ను మేడిపెల్లిలో పోగొట్టుకోగా, ఎస్సై చిరంజీవి శుక్రవారం అతనికి అప్పగించారు. గత నెలలో గంగాధర్ మేడిపెల్లిలో ఓ ఇంట్లో టైల్స్ పనులు చేసేందుకు వచ్చి సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి శుక్రవారం గంగాధర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

సేవాలాల్ మహరాజ్ విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపులో నాయకులు, గిరిజనులు

కథలాపూర్: మండలంలోని కలిగోటలో ప్రతిష్ఠించే శ్రీ సద్గురు సేవాలాల్ మహరాజ్, జగదాంబ దేవి విగ్రహాలను శుక్రవారం సాయంత్రం గ్రామం నుంచి కొత్తగా నిర్మించిన ఆలయం వరకు ఊరేగించారు. శనివారం ఉదయం విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, రిటైర్డ్ ఎస్ఈ గోవిందరావు, సర్పంచ్ ధరావత్ సరోజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'తెలంగాణలో బీజేపీదే అధికారం'

ఇబ్రహీంపట్నం: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జిల్లా పార్లమెంటరీ కో- కన్వీనర్ సదాశివ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని మండల అధ్యక్షుడు జెకరయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాల్లో రోజురోజుకు పుంజుకుంటుందని, బీజేపీపై ఇతర పార్టీ నాయకులు వ్యతిరేకంగా మాట్లాడినా.. ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ జెఎన్ వెంకట్, మాజీ జెడ్పీటీసీ సునీత, నాయకులు అలేపు శ్రీనివాస్, సంజీవరెడ్డి, పుప్పెం మహేందర్, వెంకటేశ్ యాదవ్ , తదితరులు పాల్గొన్నారు.

చిన్నాపూర్ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బుర్ర మమత

బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బుర్ర మమతను శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్ దమ్మ లత ఈనెల 11న సర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఉపసర్పంచ్ గా ఉన్న బుర్ర మమతకు అధికారులు బాధ్యతలను అప్పగించారు. గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడతానని ఇన్‌చార్జి సర్పంచ్ మమత అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి అఫ్జల్,కార్యదర్శి శిరీష, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

కథలాపూర్: భీమారం మండలం కమ్మరిపేట గ్రామంలో కోళ్లఫారంలో పనిచేసే మహారాష్ట్రకు చెందిన మహిళ(45) శుక్రవారం ఉదయం అదృశ్యమైనట్లు ఆమె బంధువులు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన సదరు మహిళ కుటుంబసభ్యులతో వచ్చి కమ్మరిపేటలో నివాసం ఉంటూ కోళ్లఫారంలో పనిచేస్తోంది. మతిస్థిమితం సరిగాలేని మహిళ శుక్రవారం ఉదయం నుంచి కనిపించడంలేదన్నారు. పరిసర గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు.పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ఆమె బంధువులు పేర్కొన్నారు.



కోరుట్ల: ఉప్పొంగి ప్రవహిస్తున్న పెద్ద వాగు



రేగుంట శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు



మత్తడి దూకుతున్న పెగడపల్లి యాపల చెరువు

నిండిన చెరువులు.. పొంగిన వాగులు

జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జగిత్యాల రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామ శివారులోని బొల్లెవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. యెఖీన్‌పూర్-సంగెం, కోరుట్ల-సంగెం గ్రామాల మధ్య గల పెద్ద వాగు వరద ఉధృతి పెరిగింది. కల్లూరువాగు వరద వంతెనపై ప్రవహించడంతో కోరుట్ల - కల్లూరు - రాయికల్ మధ్య రాకపోకలు స్తంభించాయి.మల్లాపూర్, ముత్యంపేట, మొగిలిపేట, చిట్టాపూర్, ధర్మారం నుంచి వీవీరావుపేట వరకు పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.కడెం ప్రాజెక్టునుంచి వస్తున్న వరదతో బీర్‌పూర్ మండలం కమ్మునూర్ వంతెన వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది.బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారంలోని అరగుండాల ప్రాజెక్టులు, బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లోని కుంటలు, చెరువులు మత్తడి దూకుతున్నాయి. కోనాపూర్ వాగు వరద ఉధృతితో సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలతోపాటు, మంచిర్యాల జిల్లా జన్నారం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. పెగడపల్లి మండలం శాలపల్లి - అడుపపల్లి మధ్య లో లెవల్ కల్వర్టుపై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మేడిపెల్లి మండలం కల్వకోట శివారులో కల్వర్టు వద్ద వర్షపునీరు ఉధృతంగా పారడంతో శుక్రవారం రాకపోకలు నిలిచిపోయాయి. రాయికల్ నుంచి కోరుట్లకు వెళ్లే దారిలో మైతాపూర్ వద్ద కల్వర్టుపై వర్షం నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

– సాక్షి, నెట్‌వర్క్



గుల్లపేటలో చెక్‌డ్యామ్ పూర్తిస్థాయిలో మత్తడి దూకుతున్న నీరు

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి సారించాలి

కథలాపూర్: పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఎల్వోలు దృష్టిసారించాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలకేంద్రంలో అన్ని గ్రామాల బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. బూత్‌ల వారీగా ఓటరు జాబితాలను సిద్ధం చేయాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు దొర్లితే బీఎల్వోలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గరుడ యాప్‌లో ఓటర్ల వివరాల సవరణ, కుటుంబంలోని సభ్యులందరి పేర్లు ఒకే బూత్‌లో ఉండేలా చేయాల్సిన వాటిపై అవగాహన బీఎల్వోలకు కల్పించారు. అనంతరం ఆర్డీవో పవన్‌కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో శిక్షణాధికారులు హరిప్రసాద్ శర్మ, పూర్ణచందర్, డిప్యూటీ తహసీల్దార్ గీతాంజలి, ఆర్ఐలు పాల్గొన్నారు.



బీఎల్వోలకు సూచలిస్తున్న అధికారులు

ఓటర్ వెరిఫికేషన్‌ను పకడ్బందీగా చేయాలి

మల్లాపూర్: గ్రామాల్లో ఓటర్ వెరిఫికేషన్‌ను పకడ్బందీగా చేసి నవీకరించాలని తహసీల్దార్ రవీందర్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్వోలకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. ఓటర్ల జాబితాలో సవరణలపై ఇంటింటా సర్వే చేపట్టి నవీకరించాలన్నారు. రెవెన్యూ అధికారులు బీఎల్వోల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే బీఎల్వోలు నివృత్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు నూతన ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల శిక్షణ అధికారులు లింబాద్రి, చిన్నయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి, ఆర్ఐలు రాజేశ్, సురేశ్, బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'మణిపూర్ ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి'

మెట్‌పల్లి: మణిపూర్‌లో ముగ్గురు మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడి హతమార్చిన కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం మాట్లాడారు. మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడమే కాకుండా అత్యాచారం చేసి హతమార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇంతకంటే ఆటవికమైన చర్య ఉండదని, ఈ వ్యవహారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

కోరుట్ల: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మత విద్వేశాలు రెచ్చగొట్టే ప్రక్రియలో అమాయక గిరిజన మహిళలు బలికావటం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

'ఎమ్మెల్యేకు కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు'

కొండగట్టు: చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధి పై లేదని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం కొడిమ్యాల మండలంలో వర్షాలకు దెబ్బతిన్న దారులను పరిశీలించి మాట్లాడారు. కొడిమ్యాల నుంచి సూరంపేటకు వెళ్లే దారి ప్రమాదకర స్థాయికి చేరుకుందని, గతంలో ఈ దారిలో ముగ్గురు మరణించారని, అలాగే కొడిమ్యాల నుంచి నాచుపెల్లి కి చేరుకునే మార్గంలో మొదలు పెట్టిన బ్రిడ్జి ఆరంభ దశలోనే ఆగిందన్నారు. ఈ దారి గుండా కొండగట్టు వేములవాడ వెళ్లే యాత్రికులు అధిక సంఖ్యలో ఉంటారన్నారు. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వంపై నమ్మకం లేక మధ్యలోనే పనులు నిలిపివేశారన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ మండలం గ్రామంలో సమస్యలుంటే ఎమ్మెల్యే మాత్రం మండలానికి కొంతమంది సామంత రాజుల చేతిలో బందీ అయి ఉన్నారని అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్‌తో పదవి అనుభవిస్తూ హక్కులను కాలరాస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరి నారాయణ గౌడ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మహిపాల్‌రెడ్డి నాయకులు మల్లిఖార్జున్‌రెడ్డి జీవన్‌రెడ్డి ప్రసాద్ జితేందర్‌రెడ్డి జనార్దన్‌రావు లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.



సూరంపేట వాగును పరిశీలిస్తున్న మేడి పెల్లి సత్యం

రోడ్డుపై పంచాయతీ కార్మికుల నిరసన



బీర్‌పూర్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

సారంగాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామపంచాయతీ కార్మికులు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా శుక్రవారం సమ్మె కొనసాగించారు. బీర్‌పూర్ పంచాయతీ కార్మికులు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. దీనితో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని శాంతింపజేశారు. ప్రభుత్వం మా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

కోరుట్లలో వర్షానికి కూలిన ఇల్లు

కోరుట్ల: పట్టణంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి కోరుట్ల పట్టణంలోని బెండపెల్లిలో అజీమ్ కు చెందిన ఇల్లు కూలింది. కూలిన ఇల్లును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భూమేశ్ పరిశీలించారు.నష్టపరిహారం కోసం నివేదిక పంపుతామని తెలిపారు.



బెండపల్లిలో కూలిన ఇల్లు

అదనపు కలెక్టర్‌కు బీసీ నాయకుల సన్మానం



జగిత్యాలటౌన్: జగిత్యాల అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దివాకర్‌ను బీసీ సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. ఇటీవల బదిలీపై జగిత్యాల జిల్లాకు వచ్చిన అదనపు కలెక్టర్‌ను శుక్రవారం జగిత్యాల కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ సంఘం నేతలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ముసిపట్ల లక్ష్మీనారాయణ,చింతల గంగాధర్, అలిశెట్టి ఈశ్వరయ్య,తిరుపురం రాంచంద్రం తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయిలో సల్ల రాజయ్య అనే రైతుకు చెందిన గేదె విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. వివరాలివిధంగా ఉన్నాయి. శుక్రవారం ఉదయం మేతకు వెళ్లిన గేదే గ్రామ శివారుల్లోని ఓ సెల్‌టవర్ దగ్గర ఉన్న పోల్‌కు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. ఈ పోల్ వద్దకు మేసుకుంటూ వెళ్లిన గేదె విద్యుత్తుషాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. పాడి గేదె విలువ రూ. 60 వేల వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు.

రేషన్ బియ్యం అందేదెప్పుడో?

రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో నిరుపేదలకు ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యం ప్రతినెల 10వ తేదీలోపు లబ్ధిదారులకు పంపిణీ జరిగేది. నేటి వరకు రేషన్ బియ్యం మంజూరు కాకపోవడంతో నిరుపేదలు ఎదుర్కొంటున్నారు. రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో మొత్తం 40 రేషన్ దుకాణాలు ఉండగా, కేవలం 17 రేషన్ దుకాణాలకు మాత్రమే రేషన్ బియ్యం మంజూరయ్యాయి. మిగతా 23 దుకాణాల్లోకి రేషన్ బియ్యం పంపిణీకి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి రేషన్ బియ్యం సరఫరా చేసేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ విషయంపై తహసీల్దార్ ఖయ్యూంను వివరణ కోరగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సరఫరా కాగానే పంపిణీ చేస్తామని తెలిపారు.



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్(ఫైల్)

ప్రమాదం అంచున ప్రయాణం

జగిత్యాలటౌన్: పట్టణంలోని 9వ వార్డు ధరూర్ క్యాంపును ఆనుకుని ఉన్న వినాయక్‌నగర్‌కు వెళ్లే దారిలో కరెంట్ స్తంభం ఉండటంతో వినాయకనగర్ వాసులతో పాటు ధరూర్ డబుల్ బెడ్‌రూం కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలో కరెంట్ పోల్, పక్కనే కెనాల్ ఉండటంతో ఆ దారిలో వెళ్లే ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో అటువైపుగా వెళ్లే వారు భయంభయంగా వెళ్తున్న పరిస్థితి. విద్యుత్ అధికారులు స్పందించి పోల్ తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో కరెంట్ స్తంభం

కేజీవీల్స్ ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

జగిత్యాలరూరల్: ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు పెట్టి రోడ్లు నిర్మిస్తుంటే ట్రాక్టర్ల యజమానుల నిర్లక్ష్యంతో కేజీవీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై వెళ్తుండటంతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సమయంలో పొలాలు దున్నేందుకు ట్రాక్టర్ యజమానులు రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడుపుతుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. శుక్రవారం ఉదయం కల్లెడలో కేజీవీల్స్ ట్రాక్టర్ జాతీయ రహదారిపై వెళ్తుండటంతో రోడ్డు ధ్వంసమైంది.



కల్లెడలో రోడ్డుపై వెళ్తున్న కేజీవీల్స్ ట్రాక్టర్లు

'చలో జగిత్యాల' పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలటౌన్: ఈనెల 27న జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాల్సిందిగా మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు గంగారాం కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌లో హలో మాదిగ చలో జగిత్యాల విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల విశ్వరూప మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. వర్గీకరణ అంతిమ పోరాటంలో ప్రతి మాదిగ బిడ్డ ముందుకు రావాలని కోరారు. మహాసభకు మాదిగలతో పాటు ఉపకులాలు భారీగా తరలిరావాల్సిందిగా కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆటో డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక

కథలాపూర్: మేడిపెల్లి మండల ఆటో డ్రైవర్స్ యూనియన్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొల్పుల రాజేందర్, ఉపాధ్యక్షుడిగా చంద్రగిరి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా బొంగోని మహేశ్ గౌడ్ ఎన్నికయ్యారు. సంఘం బలోపేతానికి కార్యవర్గసభ్యులు కృషి చేయాలని జిల్లా నాయకులు కోరారు.

నేడు ఇబ్రహీంపట్నంలో బీఎల్‌వోలకు శిక్షణ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో శనివారం ఉదయం 10 గంటలకు మోడల్‌స్కూల్‌లో మండల బీఎల్‌వోలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తహసీల్దార్ రవికిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

మండల సమావేశం రద్దు

పెగడపల్లి: శనివారం జరగనున్న పెగడపల్లి మండల సాధారణ సమావేశం రద్దయినట్లు ఎంపీడీవో పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శుల నియామకం

కొండగట్టు: చొప్పదండి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులుగా శుక్రవారం పలువురిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్, నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రమణారెడ్డి (రామకిష్టాపూర్), కాసరపు శ్రీకాంత్ (కొడిమ్యాల), కందుల గంగాధర్ (పూడూర్), మ్యాకల శ్రీకాంత్ యాదవ్ (నల్లగొండ), చిర్ర నవీన్ (నాచుపెల్లి) అల్లేశ్వరీ గణేశ్ (సూరంపేట)లను నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. తమ నియమకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాజీ ఎంపీ పోన్నం ప్రభాకర్‌గౌడ్, నియోజక వర్గ ఇన్‌చార్జి మేడిపెల్లి సత్యం, నారాయణ గౌడ్ అజయ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ మండల అడ్వైజరీ కమిటీ..

వెల్గటూర్: మరోసారి బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా, రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సలహాలు సూచనల కోసం ఉమ్మడి వెల్గటూర్ మండల అడ్వైజరీ కమిటీని మంత్రి కొప్పుల ఈశ్వర్ నియమించారు. అధ్యక్షుడిగా రాజక్కపల్లికి చెందిన మాజీ జెడ్పీటీసీ దోరిశెట్టి వెంకటయ్య, అధికార ప్రతినిధిగా రాంనూర్‌కు చెందిన సంకోజు తిరుమల్‌ను నియమించారు. తమ మీద నమ్మకంతో కమిటీలో స్థానం కల్పించినందుకు కమిటీ సభ్యులు మంత్రి ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.



